కథా కౌముది

# ఏడడుగులు

స్వాతీ శ్రీపాద

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

ఎక్కడ చూసినా ఒకటే హడావిడి. రంగు రంగుల పరికిణీలు ఒకచేత్తో ఎత్తిపట్టుకుని ఇంకా రెక్కలు సరిగ్గా రాని సీతా కోక చిలుకల్లా అటూ ఇటూ పరుగులు తీస్తున్న పదేళ్ళ కు అటూ ఇటూ గా ఉన్నఅమ్మాయిలూ , అమ్మల చేతులు పట్టుకు గాలి బుడగల్లా ఊగుతూ, గారాలుపోతూ, అది కావాలి ఇది కావాలని వేదిస్తున్న రెండు మూడేళ్ళ అబ్బాయిలూ అమ్మాయిలూ సినిమాల్లో చూసిన లేటెస్ట్ ట్రెండ్ సాంప్రదాయిక డిజైనర్ లంగా వోణీలు గిల్ట్ వో బంగారమో కాని వడ్డాణాలు,వంకీలూ, కాసుల పేర్లు, ఓరచూపులూ పెళ్లీడు అబ్బాయిల కళ్ళలో పడాలన్న తపనలూ వీటన్నింట్లో కొత్తమెరుపు కాగితం లో చుట్టి కట్టిన పూలగుచ్చాల్లా వయస్సులో ఉన్న అమ్మాయిలు.

అవును. అసలు కన్నా ఆడంబరం ఎక్కువై పోయిన పెళ్ళిళ్ళు. లేత గులాబీ రంగు గోరింటాకు చూసి ఎన్నాళ్ళయింది! పచ్చని ఆకు తెంపుకు వచ్చి రుబ్బి పెట్టుకున్న రంగుకో నానా కెమికల్స్ కలిపి పొట్లాలు కట్టిన మెహందీకి పూల వనానికీ ఒక జంతు ప్రపంచానికీ ఉన్నంత అంతరం.

మోచేతులదాకా ముదురు తోపు రంగులో చెయ్యంతా అల్లుకు పోయిన డిజైన్లు చూసేందుకే వెగటుగా అనిపిస్తున్నాయి. ఎన్నాళ్ళకో కలిసిన బంధువర్గాలు ఒకరితో ఒకరు పరామర్శలూ, కష్టస్సుఖాలు కలబోసుకోడం ఎక్కడి వాతావరణం అక్కడ కనిపిస్తోంది.

ఇప్పటికి నా పెళ్ళైన నలభై నాలుగేళ్ళలో కనీసం ఒక వంద పైగా పెళ్ళిళ్ళు చూసాను. ఒక రొటీన్ తంతు. పెళ్లి వారిని ఎదుర్కోడం, దుమ్ము కాళ్ళు కడగటం అంటూ పీట మీద నించో బెట్టి పెళ్ళికొడుకు కాళ్ళు కడగటం, మంగళ హారతులు, వెనకాల వచ్చిన ఆడవాళ్ళకు బొట్టు జాకెట్ గుడ్డలు ఇవ్వడం. ఆ సరికే పెళ్లి కూతురు పెళ్లి పందిరి అనే వేదిక మీద గౌరీ పూజ చేస్తూ ఉంటుంది. బావమరిది వరసైన వాళ్ళు కడిగిన కాళ్ళు నెలకు ఆనకుండా ఎత్తుకు తీసుకు వెళ్లి వేదిక ముందు భాగాన వేసిన కుర్చీలో ఆమెను చూడనివ్వకుండా ఆశీనుడిని చెయ్యడం ... ఒక్కదానిలోనూ ఒక యాంత్రికత తప్ప సహజత్వమే కనబడదు. ఎవరి ధ్యాసలో వాళ్ళు. నెమ్మదిగా తలతిప్పి అందరినీ ఒకసారి గమనించాను. పెళ్లి వేదికకు ఆ పక్కన పెళ్ళికొడుకు తరఫు వాళ్ళు ఈ పక్కన పెళ్లి కూతురి తరఫు వాళ్ళు. ఇదివరకులా చాపాలమీద కూర్చునే కాలం చెల్లిపోయింది. అందరికీ కీళ్ళనొప్పులు ముప్పై దాటకుండానే వస్తున్నాయి. అందుకే కుర్చీలు ... లైవ్ టెలికాస్ట్ కి ఏర్పాట్లు. పెళ్ళికూతురి వెనక కొత్తగా పెళ్లైన, పెళ్లి కావలస్సిన అమ్మాయిలూ, పిన్నులూ , మేనత్తలూ అవసరం లేకున్నా ఏదో ఒకటి సవరిస్తూ ...

వద్దన్నామనసు గతంలోకి వెళ్లి పోయింది. ఎంత నిరాడంబరంగా జీవితాలు పంచుకున్నారు? ఒకరంటే ఒకరికి వల్లమాలిన అభిమానం, దూరమై బ్రతకలేమనిపించాక, తలిదండ్రులను ఒప్పించలేమని అర్ధమయాక నలుగురు మిత్రుల మధ్య జరిగిన పెళ్లి. అయినా తలెత్తి అతని వంక చూసేందుకే ఎంత బెరుగ్గా ఉండేది. ఒకరి కొకరు మనసులు తప్ప మరేదీ ఇచ్చి పుచ్చు కోలేదు.

ముప్పై మూడేళ్ళ తరువాత కూడా “ ఇంకా ఇలా కొత్త పెళ్ళికూతురిలా సిగ్గుపడతావు” అనేవాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

నిన్న గాక మొన్న కవ్వింపుగా అతను పాడిన ఆ పాట చెమ్మ ఇంకా తడి ఆరలేదు. “ ఇరువుర మొకటై పరవశించగా ఇంకా జాగేలా బేలా” కంటిలో నీటి పొర కదిలింది. అది చుక్కగా మారి కొలకులు దాటకుండా జాగ్రత్తపడ్డాను.

తలుచుకుంటే గుండె బరువెక్కి పోతుంది. ఎలా ఉన్నాను తను లేకుండా ? అనిపిస్తుంది. మరుక్షణమే ఓదార్పుగా వీచిన గాలి చెక్కిళ్ళు తాకి అతని చేతి పరామర్శలా లాలిస్తుంది.

ఏమిటో ... నేను మాత్రమే ఇలా ఎందుకున్నానో, ...

పెళ్లి జరుగుతున్నా ఆలోచనలు తమ దారిన తాము సాగుతూనే పోయాయి. పెళ్లి కూతురు లావణ్య పెద్దన్నయ్యకు నాలుగేళ్ళ క్రితం పెళ్లైంది. ఆర్నెల్లలో ఆ పిల్ల నాకు నచ్చలేదు. ససేమీరా నేను దానితో కలిసి ఉండలేనని విడాకులకు వెళ్లి పది లక్షల నష్ట పరిహారం ఇచ్చి వదిలించుకున్నాడు. పాపం అనిపించింది. రుచి చూసి నచ్చలేదని ఏకూరో వదిలేసినంత సులువా ఇలా జీవితంలోకి వచ్చిన మనిషిని వదిలెయ్యడం అనుకున్నాను. అదిగో ఆ చివర కూచున్న సుమతి కొడుకు పెళ్లై నాలుగేళ్ళు. రెండేళ్ళుగా కోడలు రావడం లేదు. కలిసి ఉండటం నా వల్ల కాదు విడిగా వస్తావా రా లేదూ నీ దారి నీది నా దారి నాది అందట.

మనసు చివుక్కుమంది.

పెళ్ళికి కొత్త నిర్వచనం ఇవ్వాలేమో.

సంప్రదాయాన్ని ఎగతాళి చేస్తున్నట్టు పెళ్ళికి ముందే కలిసి కబుర్లూ షికార్లూ స్వీట్ నతింగ్స్ అన్నీ అయాక మళ్ళీ తెరచాటు పరదాలు, జీలకర్ర బెల్లాలు, ... మంత్రాలు ... తంత్రాలు

తుమ్మితే ఊడే ముక్కులా తయారైన ఈ పెళ్లిళ్లకు ఇలా డిజైనర్ చీరలూ, సినిమా షూటింగ్ లా మేకప్ లు వెడ్డింగ్ థీమ్ లూ, అట్టహాసంగా లైవ్ టెలికాస్ట్ ... కనీసం ఒక్కసారైనా ఇతనే నా జీవన సహచరుడు అనుకోలేని దౌర్భాగ్యం, అప్పో సొప్పో లక్షలు ఖర్చు అవాల్సిందే అట్టహాసంగా పెళ్లి జరగాల్సిందే.

బంగారు బొమ్మ రావేమే –సన్నాయిపాట. అవును బంగారు బొమ్మలే కావాలి.ఒంటి నిండా బంగారం దిగేసుకున్న బొమ్మలు. వరుడు మనసైన వాడో కాదో ... గాని

ఛ మరీ పెళ్ళికి వచ్చి ఈ ఆలోచనలేమిటి అనుకున్నాను.

వెనకాల ఎవరో అమ్మాయిలూ గుసగుసలాడుకుంటున్నారు. వద్దన్నా మాటలు వచ్చి చెవులను మనసును తాకుతూనే ఉన్నాయి.

“ మొన్న మొన్నటి దాకా వాడు లేకుండా బ్రతకలేనని అంటివి గదా , మరి వీడితో పెళ్ళెందుకు చేసుకున్నావు?”

వాడు , వీడేనా మర్యాద అనేదే లేదా అనుకున్నాను.

“ ఇప్పుడు కూడా వాడిని చూడకపోతే అంతేనే కాని ఏంచేస్తాను? తప్పలేదు. అమ్మకు నాన్నకు వాడు నచ్చలా ... చదువు లేదంటారు. కాని ఎంత ప్రేమగా మాట్లాడతాడు? అది చాలే.తిండీ తిప్పలు లేకున్నా బతికెయ్యడానికి. కాని మేం చూసిన వాడిని చేసుకోకపోతే చిల్లిగవ్వ ఇవ్వమన్నారు. ఇద్దరూ కొంపలు మునిగి నట్టు ఒకటే ఏడుపు. అమ్మ చెప్పిందిలే. ప్రేమ ప్రేమే పెళ్లి పెళ్ళే దేని దారి దానిదని. అదే అనుకున్నాం. వీలైనప్పుడు కలుస్తాం. ఫోన్ చేస్తానన్నాడు రోజూ”

తలతిప్పి చూద్దామని ఎంత బలంగా అనిపించినా అతి కష్టం మీద ఉగ్గబట్టుకున్నాను.

ఎటు పోతోందీ యువత?

ఒకరిద్దరు తెలిసిన వారు పలకరించారు. ఒక చిరునవ్వు ఒక కరచాలనం.

ఏం పట్టుకుపోయేది ఉంది.

ఇంతలో మంగళ సూత్ర ధారణ ముగిసినట్టుంది. మిగతా కార్యక్రమాలు జరుగుతున్నాయి. తలంబ్రాలు అంటూ పాతికేళ్ళు దాటిన వారు అక్షంతలు పోసుకోడం ఫోటోలో ఒక్కోగింజా రావాలని మొహాలు సరిగ్గా కనబడాలనీ సవరించుకుని కృతకంగా ఫోటోలు...

ఈ లోగా పెద్ద వాల్యూం తో మైక్ గరగరమంది. కాస్సేపటికి సర్దుకున్నాక అర్ధం అయింది. పెళ్లి పాటలు పాడే బృందం ఏర్పాటు చేసారని. సంప్రదాయ గీతాలు వినిపిస్తారేమోనని మనసులోనే సంబరపడ్డాను కాని అది ఆవిరవడానికి ఎంతో సమయం పట్టలేదు. పాతకాలం మొదలు నిన్నమొన్నటి వరకు వచ్చిన సినిమాలలో పెళ్లి పాటలు పాడింది ఆ బృందం.

పట్ట పగలు నూతన దంపతులకు చుక్కను చూపించాక అదే అరుంధతి ఇహ అతిధుల ఆశీర్వచనాలు. రెండు దాటింది. ఆకలితో నకనకలాడుతూ ఉగ్గ బట్టుకు కూచున్న వాళ్ళు ఒక్కసారి లేచారు.

ఈ అరుంధతి ఆచారం ఎందుకో ఈ తరం వారికి.

ఈ లోగా ఒక్కొక్కరూ లేచి బంధుమిత్ర ఉభయకుశలోపరిగా పరామర్శలు.

ఇహ ఏదో కాస్త తిన్నాననిపించి సెలవు తీసుకోడం మంచిదనుకున్నాను.

లేచి రెండడుగులు వేశానో లేదో ఆర్నెల్ల క్రితం పెళ్ళయిన పారుల్ వాళ్ళమ్మ పలకరించారు.

గుజరాతీ అమ్మాయి,శశాంక తనూ ఒకే ఆఫీస్ –ప్రేమ పెళ్లి.

బాగానే వుంది. అమ్మయ్య కాస్త కాస్త మారుతున్నారు కులం మతం అంటూ వేళ్ళాడ్డం మాని అనుకున్నాను.

కాని పారుల్ వాళ్ళమ్మ ఏం చెప్తోందో ముందు అసలు అర్ధం కాలేదు.

" నరకం చూపిస్తున్నారు"

ఎవరు ఎవరికి నరకం చూపిస్తున్నారు , ఆ మాటా నాకెందుకు చెప్తోంది...

తెల్లమొహం వేశాను.

" నాలుగు నెలలుగా నా కూతుర్ని నాతోనే ఉంచుకున్నాను. పెళ్ళైన మూడో రోజునుండే మొదలు సతాయంపు. ఎంత గ్రాండ్ గా పెళ్లి చేశాము. ఎవరూ కనీవినీ ఎరగని విధంగా , అయినా ఏం తెచ్చావని రోజూ సతాయింపే. రాత్రీ పగలూ ఉద్యోగం చేసి పైసా పైసా లెక్కలు చెప్పాలట...పార్లర్ కి వెళ్ళా లన్నా చివరికి సానిటరీ నాప్కిన్స్ కూడా లెక్క చెప్పాలట........"

నా తల గిర్రున తిరిగింది.

"శశాంక ఏమీ అనడా?" ఎందుకు అడిగానో నాకే తెలియదు.

"ఏమీ అనడు మూగ మొద్దులా నిల్చుంటాడు... వాడి అక్కలూ అంతే ..కోర్ట్ కి వెళ్ళమంటున్నారు " అల్లుడిని వాడు అన్న ఆమె సంస్కారం ఎక్కువేమీ కాదనిపించింది.

నెమ్మదిగా అక్కడినుండి ఎవరినో మాట్లాడిస్తూ తప్పించుకున్నాను..

మనసుకు బెంగగా అనిపించింది.

నేనూ తనూ ఎప్పుడో అనుకున్న మాటలు మళ్ళీ మనస్సులో మెదిలాయ.

తొలితొలి రోజుల అలకలు కోపాలు ఒకటి రెండు సార్లు చూసాక్ కాబోలు, ఆ రోజున అందరూ నిద్రపోయిన అర్ధరాత్రి, ఆలస్యంగా ఉదయించిన నవమి నాటి వెన్నెట్లో చాపమీద వాలిన అతని ఎదపై తల పెట్టుకుని ముని వేళ్ళతో మీసాలు సవరిస్తూ

" మనిద్దరం ఈ వెన్నెల సాక్షిగా ఒక ప్రమాణం చేద్దాం" అన్నాను

" ఊ చెప్పెయ్యి"

"ఇహపై మనకు ఒకరి భావాలు ఒకరికి నచ్చకపోతే, ఈ అల్లకలూ కోపాలూ వద్దు. అది రంపపు కోతలా ఉంటుంది. ఎవరిష్టం వారిది అనుకుందాం. మాట్లాడకపోతే నాకు భయంగా ఉంటుంది. ..." ఆపైన మాటలు రాలేదు కళ్ళలోని నీళ్ళు అడ్డంపడి.

దగ్గరకు లాక్కునిఉక్కిరిబిక్కిరి చేస్తూ , "నువ్వు చెప్పావు నేను చెప్పలేదు అదేరా తేడా... సరే ఇహపై మనకు వాదనలే వద్దు. అందరిలా జీవితాంతం వరకే కాదు ఒకరికొకరం ఎప్పుడూ కలిసే ఉందాం"

నిజమే ...

అందుకే గదా నా చుట్టూ ప్రతి క్షణమూ అతనే.

కాని ఈ తుమ్మితే రాలిపడే ఉల్కల్లా ఈ కాలపు పెళ్ళిళ్ళు ఎటు దారి తీస్తున్నాయి.

అన్యమనస్కంగా ఒక చివర కూచున్నాను. అంద’రికీ దూరంగా ...........

“వద్దంటే వినవు కదా కామాక్షీ ఆ కళ్ళకు కాటుక పెట్టుకుంటే నలుగురి కళ్ళూ నీ మీదే, అందుకే దిష్టి తగిలి వొళ్ళు వెచ్చబడింది.

“ఒరే సుబ్బారావ్, ఇంకా నీకు అనుమానం పోలేదా ఎవడో నన్ను ఎత్తుకు పోతాడని.. “ముసిముసిగా నవ్వు.

తలతిప్పి ఓరగా చూసాను

పండుటాకుల్లా , రేపటి తరాన్ని వెక్కిరిస్తూ ఒకరి చూపుల్లో ఒకరు కరిగిపోతూ కామాక్షీ సుబ్బారావూ——తొంభైల్లోకి అడుగుపెట్టిన పెళ్ళికూతురి తండ్రి నాయనమ్మ ముత్తాతా.

వణుకుతున్న ఆమె పెదవులపై “మీ నగు మోమూ నా కనులారా.........”

★★★★★★★

Click here to share your comments on this story